
సాక్షి పశ్చిమగోదావరి

శనివారం । 13 । ఏప్రిల్ । 2024



నగదు స్వాధీనం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీలు కొనసాగుతున్నాయి. నిబంధనలు మీరి నగదు తరలిస్తే సీజ్ చేస్తున్నారు. 8లో ▸



వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలన మెచ్చి ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. 8లో ▸



పచ్చ పైత్యం భరించలేక..

పచ్చ బ్యాచ్ కుట్రలు తాళలేక రాజీనామా చేస్తున్నట్లు వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లావ్యాప్తంగా వలంటీర్ల రాజీనామాల పర్వం కొనసాగుతోంది. 8లో ▸

ఉండిలో వీడని ఉత్కంఠ

తేలని పంచాయితీ

- అమలాపురంలో ఎమ్మెల్యే రామరాజు, టీడీపీ కేడర్‌తో చంద్రబాబు భేటీ
- సీటుపై ఇంకా ఇవ్వని స్పష్టత
- రెండు రోజుల్లో ప్రకటిస్తానని వెల్లడి
- అభ్యర్థి మార్పునకు సంకేతమని మండిపడుతున్న శ్రేణులు
- ఉండిలో 3వ రోజుకు చేరిన నిరాహార దీక్షలు



ఉండిలో నిరాహార దీక్ష చేస్తున్న టీడీపీ నాయకుల వద్ద విచారంగా కూర్చున్న ఎమ్మెల్యే రామరాజు

సాక్షి, భీమవరం/ ఉండి: పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గంలో కూటమి సీటుపై సస్పెన్స్ ఇంకా కొనసాగుతూనే ఉంది. పాలకొల్లు, అమలాపురంలలో ఇప్పటికే రెండు సార్లు కూటమి అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే మంతెన రామరాజుతో, టీడీపీ నేతలతో భేటీ అయిన చంద్రబాబు ఇంకా స్పష్టత ఇవ్వకపోవడంపై కేడర్ మండిపడుతున్నారు. ఉండి అభ్యర్థిగా ఎమ్మెల్యే రామరాజును మొదటి జాబితాలోనే చంద్రబాబు ప్రకటించగా ఆయన ప్రచారం చేసుకుంటున్నారు. రఘురామకృష్ణరాజుకు ఎంపీ సీటు దక్కకపోవడంతో అతని కోసం రామరాజు సీటుకు ఎసరు పెట్టారు. ఈ క్రమంలో ఉండి సీటు మారుతున్నట్టు వారం రోజులుగా ప్రచారం జరుగుతోంది. పాలకొల్లు ప్రజాగళం పర్యటనలో ఎమ్మెల్యే రామరాజు, టీడీపీ నేతలు చంద్రబాబును కలిసి స్పష్టత ఇవ్వాలని కోరినా ఆయన స్పందించలేదు. దీంతో సీటు మారిస్తే రఘురామకృష్ణరాజును చిత్తుగా ఓడిస్తామంటూ చంద్రబాబు ఎదుటే టీడీపీ నేతలు నిరసన తెలిపారు. తమను కాదని అభ్యర్థిని మారిస్తే మూకుమ్మడి రాజీనామాలు చేస్తామంటూ జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయి నాయకులు సంతకాల సేకరణ చేశారు. పలువురు నిరాహార దీక్షలు చేపట్టారు. భీమవరంలోని టీడీపీ జిల్లా కార్యాలయాన్ని ముట్టడించి పార్టీ శ్రేణులు ఆందోళన సైతం నిర్వహించారు.

అమలాపురంలోనూ అదే తీరు

ఉండి సీటు విషయమై వారం రోజులుగా నెలకొన్న నిరసనల నేపథ్యంలో ఎమ్మెల్యే రామరాజును, నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేతలను చంద్రబాబు శుక్రవారం అమలాపురం పిలిపించుకుని మాట్లాడారు. చర్చలు జరుగుతున్నాయని, రెండు రోజుల్లో ప్రకటిస్తానని వారిని వెనక్కి పంపేశారు. రామరాజుకే సీటని స్పష్టత ఇస్తారనుకుంటే ఇంకా నాన్చుడు ధోరణిలో ఉండటం సీటు మార్పునకు సంకేతమని టీడీపీ నాయకులు చంద్రబాబుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలకే సీటని చెప్పి మొదటి జాబితాలోనే రామరాజు పేరును ప్రకటించి ఇప్పుడు మరొకరి పేరు తెరపైకి తేవడం ఎంతవరకు సబబని ప్రశ్నిస్తున్నారు. గత ఎన్నికల్లో పార్టీ కార్యాలయం ముందు సైకిల్ గుర్తును తగలబెట్టిన వ్యక్తికి సీటు ఎలా ఇస్తారని మండిపడుతున్నారు. ఇంతకాలం నిబద్ధతతో పార్టీ కోసం పనిచేసిన తమకు అన్యాయం చేస్తూ మరొకరిని పోటీలో దింపితే చూస్తూ ఊరుకోబోమని, తగిన శాస్తి చేస్తామని పలువురు టీడీపీ నేతలు హెచ్చరించారు. తాజా పరిణామాలపై ఎమ్మెల్యే రామరాజు విలేకరులతో మాట్లాడుతూ పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులతో మాట్లాడి భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటానని చెప్పారు.

మూడో రోజుకు చేరిన నిరాహార దీక్షలు

ఎమ్మెల్యే రామరాజుకు మద్దతుగా ఉండిలోని టీడీపీ మండల కార్యాలయం వద్ద పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జుత్తిగ శ్రీనివాస్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు చెన్నంశెట్టి హరినాయుడు, పాలకోడేరు ఏరియా కన్వీనర్ కాలా గణేష్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష మూడోరోజుకు చేరింది. ఉదయం హరినాయుడు, గణేష్‌లకు సెలైన్లు ఎక్కించారు. చంద్రబాబుతో భేటీ అనంతరం మధ్యాహ్నం ఎమ్మెల్యే రామరాజు శిబిరం వద్దకు చేరుకున్నారు. గణేష్‌ను వైద్య సాయం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



చిలుకూరులో కొనుగోలును ప్రారంభించిన జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

ఉండి: మండలంలోని అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్టు జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని చిలుకూరులో జిల్లా కో–ఆపరేటివ్ అధికారి ఎం.నాగరాజుతో కలిసి ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. దాళ్వా ధాన్యం కొనుగోలుకు ఆర్‌బీకేల్లో ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ధాన్యంలో తేమ 17 శాతం లేదా అంతకన్నా తక్కువగా ఉండేలా చూడాలన్నారు. గోనె సంచులు సిద్ధం చేశామన్నారు. జిల్లా కో–ఆపరేటివ్ అధికారి నాగరాజు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా చేపట్టామన్నారు. ఏడీఏ కేఏఎస్ఎస్ శ్రీనివాస్ మాట్లాడారు. ఉండి కో–ఆపరేటివ్ బ్యాంక్ కార్యదర్శి బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మొదటి విడత ఈవీఎంల ర్యాండమైజేషన్



ప్రక్రియను చేపడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

భీమవరం (ప్రకాశంచౌక్): మొదటి విడత ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను పక్కాగా నిర్వహించినట్టు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఈఎంఎస్02.ఓ వెబ్‌సైట్‌లో ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పూర్తి చేసినట్లు చెప్పారు. ఎన్నికల సంఘ సూచనల మేరకు పారదర్శకంగా ప్రక్రియను పూర్తిచేశామన్నారు. జిల్లాలో ఒక లోక్‌సభ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ర్యాండమైజేషన్ పూర్తిచేశామని, ఈవీఎం, వీవీప్యాట్స్ యంత్రాలు తరలించే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ ఉంటుందన్నారు. పటిష్ట బందోబస్తు మధ్య వీటిని ఆయా నియోజకవర్గాలకు తరలిస్తామన్నారు. ర్యాండమైజేషన్ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారని అన్నారు. డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, ఎన్నికల సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ ఎం.సన్యాసిరావు, ఏడు నియోజకవర్గాల నోడల్ అధికారులు, టెక్నికల్ బృందం, రాజకీయ పార్టీల ప్రతినిధులు కామన నాగేశ్వరరావు, ఎండీ జహంగీర్, మరపట్ల శ్యాంబాబు, కాటూరి కరుణాకర్, గొట్టుముక్కల శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు కావాలి



మాట్లాడుతున్న నోడల్ అధికారి ప్రభాకర్

భీమవరం: 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల నోడల్ అధికారి జీసీహెచ్ ప్రభాకర్ కోరారు. శుక్రవారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఓటు హక్కు, ఓటు నమోదుపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారంతా తప్పనిసరిగా ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లోనూ ఓటు నమోదు చేసుకోవచ్చన్నారు. కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ భారత ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతమయ్యేందుకు ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ ఆర్.కృష్ణ చైతన్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇంజనీరింగ్ ఫిజికల్ సైన్స్ విభాగం హెడ్ ఎంవీ సోమేశ్వరరావు, చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు.

గ్రూప్–2 ప్రిలిమ్స్‌లో ప్రతిభ



అభ్యర్థులను అభినందిస్తున్న పీఓ సూర్యతేజ

బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏ ఆధ్వర్యంలో వైటీసీలో శిక్షణ పొందిన 9 మంది అభ్యర్థులు ఏపీపీఎస్సీ గ్రూప్–2 ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధించినట్లు ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ తెలిపారు. శుక్రవారం తన ఛాంబర్‌లో వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 70 మందికి 25 రోజులపాటు ఉచిత శిక్షణ అందించగా 9 మంది ప్రతిభ కనబర్చడం అభినందనీయమన్నారు. వీరికి మెయిన్స్ శిక్షణ అందిస్తామన్నారు.

భద్రాచలానికి ప్రత్యేక బస్సులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శ్రీరామనవమిని పురస్కరించుకుని భద్రాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్టు ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్వీఆర్ వరప్రసాద్ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతామని పేర్కొన్నారు. వివరాలకు సమీపంలోని డిపో మేనేజర్‌ను సంప్రదించాలని సూచించారు.

ముగిసిన జేఈఈ మెయిన్స్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జాతీయ స్థాయి ఇంజనీరింగ్ కళాశాలలు నిట్, ట్రిపుల్ ఐటీ కళాశాలల్లో ప్రవేశాలకు జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (జేఈఈ) మెయిన్స్ రెండో విడత పరీక్షలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజు పరీక్షకు స్థానిక సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో ఉదయం 182 మందికి 98 మంది, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 85 మందికి 43 మంది హాజరయ్యారు. ఈనెల 4 నుంచి ఇప్పటివరకు 2,918 మంది విద్యార్థులకు 2,567 మంది హాజరయ్యారు. పరీక్షలను కో–ఆర్డినేటర్ పి.సాయి కుమారి శంకర్ పర్యవేక్షించారు.

కూటమికి ఓటమి భయం

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



తామరాడలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: ప్రజల మద్దతు వైఎస్సార్ సీపీకే అని తేటతెల్లం కావడంతో తెలుగుదేశం పార్టీ కూటమికి భయం పట్టుకుందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శుక్రవారం పెనుగొండ మండలంలోని తామరాడ, ములపర్రు గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఏళ్ల తరబడి తామరాడలో ఉన్న డ్రెయినేజీ సమస్యను మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు చొరవతో పరిష్కారం లభించడంపై ప్రజలు నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్ర ప్రజలకు అందించిన సంక్షేమం, సిద్ధం సభలతో కూటమికి ఓటమి భయం పట్టుకుందన్నారు. దీంతో దుష్ప్రచారానికి పాల్పడుతున్నారన్నారు. వలంటీర్లపై బురద జల్లి అబాసుపాలు చేద్దామని ప్రయత్నించి బోర్లా పడ్డారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో అవ్వాతాతల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో కూటమి వెనుకడుగు వేసి మాట మార్చి వలంటీర్లను ప్రసన్నం చేసుకోవడానికి మభ్యపెట్టే యత్నాలు ప్రారంభించారన్నారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా విఫలం అవుతున్నారన్నారు. రాష్ట్ర ప్రజంతా వైఎస్సార్ సీపీ సంక్షేమ పాలనకు అండగా నిలుస్తుందన్నారు. ప్రజలంతా తమ రెండు ఓట్లూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై ఓటేయాలని అభ్యర్థించారు.

వలంటీర్లూ.. కూటమికి గుణపాఠం చెప్పాలి

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం క్యాంపు కార్యాలయం వద్ద మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: నిస్వార్థంగా సేవలందిస్తూ రాజీనామాలు చేస్తున్న వలంటీర్లు రానున్న ఎన్నికల్లో చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌కు గుణపాఠం చెప్పాలని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ మేమంతా సిద్ధం బస్సు యాత్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ ఆలోచనల నుంచి పుట్టిన గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అటువంటి పరిస్థితుల్లో వృద్ధుల చెంతకే వెళ్లి అందించే సేవలు నిలిచిపోవడం బాధాకరమన్నారు. వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకు వచ్చే సేవలు నిలిచిపోవడంతో లబ్ధిదారులంతా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వలంటీర్ల నిస్వార్థ సేవలు, సేవాతత్పరతను తప్పు బట్టి అవాకులు చవాకులు పేలిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు వలంటీర్ల జోలికి ఎందుకు వెళ్లేమా అని ఏడ్చేలా తగిన బుద్ధి చెప్పాలన్నారు. మళ్లీ జగన్ ముఖ్యమంత్రిగా గెలిచిన వెంటనే వలంటీర్లను విధుల్లోకి తీసుకునే జీఓపై తొలి సంతకం చేస్తారని మంత్రి కొట్టు అన్నారు.

వైఎస్సార్‌సీపీదే అధికారం

అప్పడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం మాట్లాడుతూ ఇప్పటివరకూ వలంటీర్లను తూలనాడి ఎన్నికలు దగ్గరకు వస్తుండటంతో రూ.10 వేలు ఇస్తామని చంద్రబాబు అనడం అనుమానాలకు తావిస్తోందన్నారు. చంద్రబాబు అధికారం కోసం ఏ స్థాయికైనా దిగజారతాడని అతని వ్యాఖ్యల ద్వారా తెలుస్తుందని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక ఐబీ సర్వే బృందం రాష్ట్రంలో పర్యటించి వైఎస్సార్‌సీపీ 124 సీట్లు గెలిచి మళ్లీ అధికారం చేపడుతుందని నివేదికల ద్వారా వెల్లడించిందన్నారు. ఇది తెలిసిన పచ్చ కూటమి తాము అధికారంలోకి రాలేమని భయపడి సీఎం జగన్ ఇచ్చే పథకాలన్నింటినీ తాము అమలు చేస్తామని సమావేశాల్లో చెప్పడం సిగ్గుచేటన్నారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్, ఎమ్మెల్యేగా కొట్టు సత్యనారాయణ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు గుండుబోగుల నాగు, చిటికన ప్రసాద్, కొట్టు విశాల్, ముత్యాల ఆంజనేయులు, ముప్పిడి సంపత్‌కుమార్, జద్దు హరిబాబు, తెన్నేటి జగ్జీవన్, కైగాల శ్రీనివాస్, కట్టుబోయిన కృష్ణప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

జగన్‌తోనే జనరంజక పాలన

ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి



కాజ తూర్పు గ్రామంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి

యలమంచిలి: జగనన్నతోనే జనరంజక పాలన సాధ్యమని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. కాజ తూర్పు గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఆయన తన భార్య మంగతాయారు, కుమారుడు సాయి బాలాజీతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్ చేసిన మేలు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. మళ్లీ సంక్షేమ పథకాలన్నీ వలంటీర్ల ద్వారా మీ ఇంటికి రావాలంటే రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా గూడూరి ఉమాబాలను గెలిపించాలని కోరారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, సర్పంచ్ పాలంకి శ్రీనివాసరావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు జవదాల సువర్ణరాజు, సర్పంచ్‌ల చాంబర్ మండల అధ్యక్షుడు వల్లభు సాయి వెంకట నరసింహారావు, నాయకులు వినుకొండ రవి, బోనం బులి వెంకన్న, బొంతు వెంకట కర్ణారెడ్డి తదితరులు ఆయన వెంట ఉన్నారు.

ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలి

రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి



మాట్లాడుతున్న చైర్మన్ హేమచంద్రారెడ్డి

నూజివీడు: ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక సంరంభం ద్వారా తమలోని విజ్ఞాన భావాలను మరింతగా పెంపొందించుకోవచ్చని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి అన్నారు. స్థానిక ట్రిపుల్‌ఐటీలో టెక్‌జైట్–24ను శుక్రవారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ మానవ సంక్షేమ కోసం కొత్త ఆవిష్కరణల వైపు విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. ఆర్జీయూకేటీ విద్యార్థులకు ఎల్లవేళలా నాణ్యమైన ఆధునిక సాంకేతిక విద్యను అందించేందుకు కృషి చేస్తోందన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి వీలవుతుందన్నారు. విద్యార్థులు సాంకేతిక రంగంలో తమకున్న ప్రతిభను నిరూపించుకోవడానికి, వారి నైపుణ్యాలను పెంచుకోవడానికి వేదికవుతుందన్నారు. టెక్‌జైట్–24లో పాల్గొనేందుకు 1,171మంది విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకున్నారని డైరెక్టర్ ఆచార్య ఎం.చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమం రెండు రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. విద్యార్థుల కోసం 12 వర్క్‌షాపులు, 33 టెక్నికల్ ఈవెంట్‌లు, మూడు ఆహ్వానిత చర్చలు ఏర్పాటు చేశామన్నారు. రిజిస్ట్రార్ ఎస్ఎస్ఎస్‌వీ గోపాలరాజు, టెక్‌జైట్ కన్వీనర్ జ్యోతీలాల్ నాయక్ పాల్గొన్నారు.

కొనుగోళ్లకు ప్రాధాన్యం

- రబీ ధాన్యం సేకరణకు చర్యలు
- ఇప్పటికే 1,027 టన్నుల కొనుగోలు
- పటిష్ట ఏర్పాట్లు చేసిన అధికారులు

ఏలూరు(మెట్రో): రబీ ధాన్యం కొనుగోలుకు ఏలూరు జిల్లా అధికారులు చర్యలు తీసుకున్నారు. మండుతున్న ఎండలను కూడా లెక్కచేయకుండా సివిల్ సప్లయిస్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో ముందుకు వెళుతూ ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకున్నారు. జిల్లాలో 120 రైతు భరోసా కేంద్రాలు, 66 ప్రాథమిక సహకార సొసైటీల ద్వారా ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించేందుకు జిల్లా అధికారులు రంగం సిద్ధం చేశారు. దీనిలో భాగంగా 15 ఆర్‌బీకేలలో ధాన్యం కొనుగోలు ఇప్పటికే ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఒక్కరోజే 665 టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, ఇప్పటివరకు 1,027 టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించారు. 87 మంది రైతులు, 105 ఎఫ్‌టీఓల వద్ద నుంచి రూ.2.22 కోట్ల ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేసి సొమ్ములు చెల్లించేందుకు బిల్లులు సిద్ధం చేశారు.

మద్దతు ధరలకు.. ధాన్యం కామన్ రకం క్వింటాల్‌కు రూ.2,183, గ్రేడ్–ఏ రకం క్వింటాల్‌కు రూ.2,203 ధరలకు కొనుగోలు చేస్తున్నారు. రైతులు రైతు భరోసా కేంద్రాల వద్దకు వచ్చి కొనుగోలు షెడ్యూల్ ద్వారా ధాన్యం విక్రయించవచ్చు.

ఇంటర్ ఫలితాల్లో 9వ స్థానం

- ఫస్టియర్ 69 శాతం
- సెకండియర్ 80 శాతం ఉత్తీర్ణత
- మే 24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు



భీమవరంలో ఇంటర్మీడియెట్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు (ఫైల్)

	విద్యార్థులు	ఉత్తీర్ణులు
మొదటి సంవత్సరం	15,645	10,843
ద్వితీయ సంవత్సరం	13,161	10,470
ఒకేషనల్ కోర్సులు		
మొదటి సంవత్సరం	1,575	981
ద్వితీయ సంవత్సరం	1,229	877

భీమవరం: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో పశ్చిమగోదావరి జిల్లా రాష్ట్రస్థాయిలో 9వ స్థానంలో నిలిచింది. ఇంటర్ బోర్డు శుక్రవారం ఫలితాలను విడుదల చేయగా ఫస్టియర్ 69 శాతం, సెకండియర్ 80 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన అనంతరం తొలిసారిగా జిల్లా బోర్డు ఆధ్వర్యంలో ఇంటర్ పరీక్షలు జరిగాయి. మార్చి 1న ప్రారంభమైన పరీక్షలు 15తో ముగిశాయి. మొదటి సంవత్సరం పరీక్షలకు 15,645 మంది విద్యార్థులు హాజరుకాగా 10,843 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 13,161 మంది హాజరుకాగా 10,470 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో ప్రైవేట్ కళాశాలలకు చెందిన విద్యార్థులు మొదటి సంవత్సరంలో 13,729 మందికి 9,930 మంది, ద్వితీయ సంవత్సరంలో 11,628 మందికి 9,479 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే ప్రభుత్వ కళాశాల విద్యార్థులు మొదటి సంవత్సరం 866 మందికి 351 మంది, ద్వితీయ సంవత్సరంలో 694 మందికి 460 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకసారి ఫెయిలైన మొదటి సంవత్సరం విద్యార్థులు 1,070 మందికి 562 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 839 మందికి 531 మంది ఉత్తీర్ణత సాధించారు.

ఒకేషనల్ కోర్సుల్లో..

ఒకేషనల్ కోర్సుల్లో మొదటి సంవత్సరం 62 శాతం, ద్వితీయ సంవత్సరం 71 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం 1,575 మంది విద్యార్థులకు 981 మంది, ద్వితీయ సంవత్సరంలో 1,229 మందికి 877 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో ప్రైవేట్ కళాశాలలకు చెందిన మొదటి సంవత్సరం విద్యార్థులు 929 మందికి 572 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 771 మందికి 559 మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే ప్రభుత్వ కళాశాలల్లో ఫస్టియర్ విద్యార్థులు 301 మందికి 157 మంది, ద్వితీయ సంవత్సరం 231 మందికి 146 మంది ఉత్తీర్ణత సాధించారు.

వచ్చేనెల 24 నుంచి సప్లిమెంటరీ

ఫెయిలైన విద్యార్థులకు వచ్చేనెల 24 నుంచి జూన్ 1 వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా పరీక్షల నిర్వహణ కన్వీనర్ కె.చంద్రశేఖర్‌బాబు తెలిపారు. ఆయా తేదీల్లో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అలాగే ప్రాక్టికల్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు జిల్లా కేంద్రం భీమవరంలోని కేంద్రాల్లో మే 1 నుంచి 4 వరకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

రీ వెరిఫికేషన్‌కు రూ.1,300

పరీక్షా ఫలితాలకు సంబంధించి రీ వెరిఫికేషన్‌కు సంబంధించి ఒక్కో పేపరుకు రూ.1,300, రీ కౌంటింగ్‌కు ఒక్కో పేపర్‌కు రూ. 260 రుసుం చెల్లించాలని చంద్రశేఖర్‌బాబు తెలిపారు. రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్‌కు ఈనెల 18 నుంచి 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

ముగిసిన రాష్ట్రస్థాయి చెస్ పోటీలు



పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు, షీల్డ్స్ అందిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్: చదరంగం సాధనతో పిల్లల్లో ఆలోచన శక్తి పెరుగుతుందని సాహిత్య అకాడమీ చైర్మన్ పిళ్లంగోళ్ల శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం ఏలూరు సమీపం వట్లూరులోని శ్రీసిద్ధార్థ క్వెస్ట్ స్కూల్ ఆవరణలో ఒక్కరోజు రాష్ట్రస్థాయి రాపిడ్ చెస్ ఓపెన్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో బహుమతి ప్రధానోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీలక్ష్మి మాట్లాడుతూ చెస్ పోటీలు నిర్వహించడం వల్ల పిల్లల తెలివితేటలకు పదును పెరుగుతుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న డి.లక్ష్మణరావు, వి.అభిరామ్, ఎల్.మౌళి, ఎం.బాల శ్రీనివాసరావు, సీహెచ్ వివేక్, ఎం.శ్రీనివాసరావు, ఎల్.అరవింద్‌బాబు, జి.అరుణకుమారి, జి.హరీష్, ఎస్.వినయ్ బాలసాయి కృష్ణ విజయం సాధించారన్నారు. వీరు భీమవరంలో జూన్ 4 నుంచి 9 వరకూ జరిగే అంతర్జాతీయ చెస్ పోటీల్లో పాల్గొంటారని పోటీల పర్యవేక్షుడు, అబ్రహం, గ్యారీకాస్పారోవ్ అకాడమీ డైరెక్టర్ జి.యెహనాన్ చెప్పారు.

2200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



సిద్ధార్థనగర్‌లో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న దృశ్యం

నూజివీడు: స్థానిక సెబ్‌స్టేషన్ పరిధిలోని సిద్ధార్థ నగర్, రేగుంట గ్రామాల పరిధిలో సెబ్ అధికారులు, సిబ్బంది కలిసి శుక్రవారం నిర్వహించిన దాడుల్లో 2200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు సెబ్ నూజివీడు ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ తెలిపారు. సిద్ధార్థనగర్ అటవీ ప్రాంతంలో ఉన్న 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేయడంతో పాటు 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే రేగుంట ప్రాంతంలో 1000 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేయడంతో పాటు 50 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా, రవాణా చేసిన చట్టప్రకారం నేరమని, వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పచ్చపైత్యం భరించలేక రాజీనామాలు

- జిల్లాలో వందల సంఖ్యలో రాజీనామాలు చేస్తున్న వలంటీర్లు
- ప్రతిపక్ష పార్టీల కుట్రలు ఆపాలని డిమాండ్

పెంటపాడు: వలంటీర్ల ద్వారా అందుతున్న ఉన్నత సేవలు సహించలేని పచ్చబ్యాచ్‌లు, కుట్రలు తాళలేక వలంటీర్ల రాజీనామా పర్వం కొనసాగుతోంది. దేశానికే ఆదర్శంగా ప్రజలకు పింఛన్‌లు, సంక్షేమపథకాలు ప్రజల గడపవద్దకే చేర్చుతూ ఎందరో ప్రముఖుల ప్రశంసలు అందుకొంటున్న సేవలు ప్రతిపక్షాలకు మింగుడు పడటం లేదు. వారిని తీవ్ర వాదులుగా చిత్రీకరిస్తూ చేస్తున్న ప్రతిపక్షాల కుట్రలు తాళలేక పెంటపాడు మండలంలో పలు గ్రామాలలో వందల సంఖ్యలో వలంటీర్లు ఆయా గ్రామ సచివాలయాల వద్ద రాజీనామాలు సమర్పించి తాడేపల్లిగూడెంలోని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యానారాయణను కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. దీంతో ఉపముఖ్యమంత్రి వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెంలోని క్యాంప్ కార్యాలయంలో వలంటీర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాల కుట్రలను తిప్పి కొట్టేందుకు వైఎస్సార్ సీపీ సిద్ధంగా ఉందన్నారు. జట్లపాలెం గ్రామంలో మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్‌ను, సచివాలయ సిబ్బందిని వలంటీర్లు కలిసి మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. అదే విధంగా కోరిమిల్లి , చింతపల్లి మీనవిల్లురు జట్లపాలెం మౌంజీపాడు, తదితర గ్రామాలలో సుమారు 60 మందికి పైగా రాజీనామాలు చేశారు. వల్లూరుపల్లి 22, ప్రత్తిపాడు-10 , జట్లపాలెం -18 మౌంజిపాడు-17 యానాలపల్లి, పరిమెళ్ల-17 మీనవిల్లూరు-12 మంది రాజీనామా చేశారు.



పెంటపాడు: తాడేపల్లిగూడెంలో వలంటీర్లతో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తణుకులో..

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం మండపాక, కోనాల గ్రామాలకు చెందిన గ్రామ వలంటీర్లు శుక్రవారం తమ విధులకు రాజీనామా చేశారు. శుక్రవారం తణుకు మండలం మండపాక గ్రామానికి చెందిన 32 మంది వలంటీర్లు, కోనాల గ్రామానికి చెందిన 13 మంది గ్రామ వలంటీర్లు తమ ఉద్యోగాలకు రాజీనామ చేశారు. మండపాక గ్రామంలోని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు నివాసంలో సమావేశమైన వలంటీర్లు తాము రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. గత కొంత కాలంగా వలంటీర్లను తెలుగుదేశం పార్టీ నాయకుల అవమానాలను నిరసిస్తూ రాజీనామా చేస్తున్నట్లు వలంటీర్లు తెలిపారు. తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో కార్యాలయంలో అందజేస్తున్నట్లు తెలిపారు.

తాడేపల్లిగూడెంలో..

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో 57 మంది వలంటీర్లు శుక్రవారం తమ విధులకు రాజీనామా చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ ఎస్.సుబ్రహ్మణ్యానికి రాజీనామా పత్రాలను అందజేశారు. ప్రధానంగా వెంకట్రామన్నగూడెం, కడిమద్ది, నవాబుపాలెం, కొమ్ముగూడెం గ్రామాలకు చెందిన వలంటీర్లు రాజీనామా చేసిన వారిలో ఉన్నారు. వలంటీర్లను అవమానించినందుకు నిరసనగా ఈ రాజీనామా పత్రాలు అందజేస్తున్నట్టు వారు ప్రకటించారు.

కాళ్లలో..

కాళ్ల: మండంలోని వేంపాడు గ్రామ సచివాలయ పరిధిలో సేవలందిస్తున్న తొమ్మిది మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. గ్రామంలో పదిమంది వలంటీర్లు ఉండగా గతంలో ఒక వలంటీర్ రాజీనామా చేయగా మిగిలిన 9 మంది శుక్రవారం రాజీనామా చేశారు. ఈ మేరకు తమ రాజీనామా పత్రాల్ని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌కు అందజేశారు.



పెంటపాడు: కోరిమిల్లి గ్రామ సచివాలయంలో రాజీనామా పత్రాలను అందిస్తున్న వలంటీర్లు



తణుకు టౌన్: మండపాకలో రాజీనామా పత్రాలను చూపుతున్న గ్రామ వలంటీర్లు



తాడేపల్లిగూడెం రూరల్: వెంకట్రామన్నగూడెం సర్పంచ్‌కు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు



కాళ్ల: వేంపాడు గ్రామంలో రాజీనామాలు చేసిన వలంటీర్లు

తాడేపల్లిగూడెం గుర్తుండేలా సీఎం జగన్‌కు స్వాగతం

ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం యాత్రలో భాగంగా ఈ నెల 15న తాడేపల్లిగూడెం వస్తున్న సందర్భంగా జగన్‌కు చెప్పే స్వాగతంలో తాడేపల్లిగూడెం ముద్ర కనబడాలని ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే అభ్యర్థి కొట్టు సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లతో సమావేశాన్ని నిర్వహించారు. 15న సోమవారం సాయంత్రం చిలకంపాడు వద్ద నుంచి తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోకి ముఖ్యమంత్రి జగన్ అడుగుపెడుతున్నారన్నారు. అక్కడి నుంచి బస్సు యాత్ర తాడేపల్లిగూడెం పట్టణం మీదుగా నల్లజర్ల వైపు సాగుతుందన్నారు. చిలకంపాడు వద్ద నుంచి వెంకట్రామన్నగూడెం సరిహద్దుల వరకు ముఖ్యమంత్రి జగన్‌కు స్వాగతం పలికే విధంగా అన్ని ప్రాంతాల నాయకులు, కార్యకర్తలు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. 2004లో మహానేత, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసేందుకు వస్తున్న సందర్భంలో తాను ఏర్పాటు చేసిన స్వాగత కార్యక్రమాన్ని పలుమార్లు గుర్తు చేసి తనను అభినందించారని గుర్తు చేశారు. అదేవిధంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఘనంగా స్వాగతం పలికేందుకు ప్రణాళికలు సిద్ధంచేసుకోవాలని అవసరమైన పక్షంలో తనను సంప్రదించాలని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

తణుకు: పట్టణ పరిధిలోని గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పట్టణ పోలీసులు శుక్రవారం గుర్తించారు. నరేంద్రసెంటర్ సమీపంలోని ఇరిగేషన్ క్వార్టర్స్ వద్ద సుమారు 30 నుంచి 40 సంవత్సరాలు వయసు కలిగిన వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం కుళ్లిన దశలో ఉండటంతోపాటు శరీరంపై ఎలాంటి దుస్తులు లేకపోవడంతో పట్టణ ఎస్సై కె.శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అయితే మృతి చెందిన వ్యక్తి గత కొద్ది రోజులుగా అక్కడే ఉంటూ యాచిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. 21వ వార్డు వీఆర్‌ఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రీనివాస్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరిలో తల్లీకూతుళ్ల మృతదేహాలు లభ్యం

యలమంచిలి: ఆర్థిక ఇబ్బందులు తాళలేక భీమవరం పట్టణానికి చెందిన బొంతు కిషోర్‌కుమార్ (32) అతని భార్య యోచన (24) కుమార్తె నిధిశ్రీ (2) బుధవారం చించినాడ వద్ద వశిష్ట గోదావరి నదిలో దూకిన సంగతి విధితమే. ముగ్గురిలో కిషోర్‌కుమార్ మృతదేహం గురువారం బాడవ వద్ద గోదావరిలో దొరగ్గా మిగిలిన తల్లీ, కూతురు మృతదేహాలు శుక్రవారం దొరికాయి. ఈ మృతదేహాలన్నింటికీ పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై కాకి శివ నారాయణ తెలిపారు. ఈ ఘటనపై మృతుని సోదరుడు బొంతు ఉదయ్‌కిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఎన్నికల్లో బీజేపీ కూటమిని ఓడించాలి



భీమవరంలో మాట్లాడుతున్న గోపాలన్

భీమవరం: ఉద్యోగ, కార్మికులకు తీవ్ర నష్టం చేసిన కేంద్రంలో బీజేపీను ఆపార్టీని బలపరుస్తున్న టీడీపీ, జనసేన కూటమిని రానున్న ఎన్నికల్లో ఓడించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్ కార్మికులకు పిలుపునిచ్చారు. శుక్రవారం భీమవరంలో కలిపిండి సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన రైస్‌మిల్ కార్మికులు విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో యజమానులకు లాభం చేకూర్చే నాలుగు లేబర్ కోడ్లు కేంద్ర ప్రభుత్వం తెచ్చిందని విమర్శించారు. గడిచిన పదేళ్ల కాలంలో పరిశ్రమలు మూసివేసి నిరుద్యోగం పెంచిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వాసుదేవరావు, కొత్తల సత్యనారాయణ, పి సంసోను, కోళ్ల శ్రీను పాల్గొన్నారు.

బాబు స్వప్రయోజనాల కోసం కులాల మధ్య చిచ్చు



మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గత ఎన్నికలలో మాలలు 99 శాతం వైఎస్సార్ సీపీకే ఓటు వేశారని, తిరిగి మాలలు వైఎస్సార్ సీపీకే వెన్నెముకగా ఉన్నారని, వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే ఓటు వేస్తారని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. పట్టణంలో శుక్రవారం జరిగిన సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ మాల, మాదిగల మధ్య చంద్రబాబు తన స్వార్థప్రయోజనాలు కోసం చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. ప్రస్తుతం చంద్రబాబుకు మాలలు పూర్తిగా వ్యతిరేకమైనట్లు చెప్పారు. మాల మాదిగలను వేరు చేయడం ద్వారా చంద్రబాబు ఎస్సీ వర్గీకరణ తెర మీదకు తేవడం, వర్గీకరణ విషయంలో మందకృష్ణ అనే వ్యక్తికి ఆర్థికంగా సహాయం చేశారని మంగరాజు ఆరోపించారు. చంద్రబాబు నేటికి మందకృష్ణను అడ్డంగా పెట్టుకుని పావులు కదుపుతున్నారని విమర్శించారు. 1997లో హైదరాబాద్‌లో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా శాంతియుత నిరసన చేస్తుంటే చంద్రబాబు దాడులు చేయడమే కాకుండా గుర్రాలతో తొక్కించి నలుగురు మాలలు చనిపోవడానికి కారణమైనట్లు చెప్పారు. పోలీసులు లాఠీ చార్జీ చేయడం వల్ల మాలలు క్షతగాత్రులు అయ్యినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు అంతం-మాలల పంతం అనే నినాదంతో మాలలు పనిచేసి చంద్రబాబును ఘోరంగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 15న సాయంత్రం భీమవరంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే బస్సుయాత్రలో జిల్లాలోని మాలలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో అద్దంకి ఆనంద్, వి.సునీల్‌కుమార్, గోపి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి గ్రామానికి చెందిన 63 సంవత్సరాల కట్రెడ్డి రామారావు(రాంబాబు) గురువారం సాయంత్రం నుండి కన్పించడం లేదని అతని కుమారుడు కట్రెడ్డి వినయ్ శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై బి.నాగబాబు చెప్పారు. అప్పుల విషయమై ఇంట్లో మాటా మాటా పెరిగి ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదని, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ప్రయోజనం లేకపోవడంతో వృద్ధుడి కుమారుడు పోలీసులను ఆశ్రయించాడు.

వాహన తనిఖీల్లో నగదు స్వాధీనం



జంగారెడ్డిగూడెం: మార్కండేయపురం వద్ద నగదును స్వాధీనం చేసుకుంటున్న దృశ్యం



కామవరపుకోట: నగదును స్వాధీనం చేసుకుంటున్న ఎన్నికల సిబ్బంది

జంగారెడ్డిగూడెం: ఎన్నికలు సందర్భంగా ఎన్నికల అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌ఛార్జ్ కేవీ రమణ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని మార్కండేయపురం వద్ద తనిఖీలు నిర్వహించగా జంగారెడ్డిగూడెం నుంచి బుట్టాయగూడెం మోటార్ సైకిల్ వెళుతున్న వ్యక్తి నుంచి రూ. 2,36,500 స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదుకు సంబంధించి సదరు వ్యక్తి ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో నగదును సీజ్ చేసి ఏఆర్‌ఓ కె.స్లీవ జోజికి అందజేశారు. ఏఆర్‌ఓ సదరు నగదును ఏలూరు ట్రెజరీకి పంపించారు. ఈ దాడుల్లో హెచ్‌సీ హెచ్‌సీ కోటేశ్వరరావు, కానిస్టేబుళ్లు అబ్బులు, మంగరాజు, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

కామవరపుకోటలో రూ. 1.64 లక్షల స్వాధీనం

కామవరపుకోట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కామవరపుకోట కొత్తూరులో వద్ద ఎన్నికల చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీలలో భాగంగా గురువారం రాత్రి 11 గంటల సమయంలో కారులో వెళుతున్న ఒక వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లేని రూ. 1.64లక్షల స్వాధీనం చేసుకున్నట్లు చెక్‌పోస్ట్ ఎన్నికల ఇన్‌చార్జ్ అధికారి కె.బాబురావు తెలిపారు. ఈ నగదు చింతలపూడి మండలం నామవరం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి కారులో స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ నగదును ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఫణీంద్ర ద్వారా ఏలూరు ట్రెజరీలో జమ చేస్తామని తెలిపారు. వాహనాల తనిఖీల్లో కె.రమేష్, పి.రాంబాబు, కె.రామకృష్ణ పాల్గొన్నారు.

వీరవాసరంలో రూ.92,800 నగదు స్వాధీనం

వీరవాసరం: ఎన్నికల్లో విధుల్లో భాగంగా వీరవాసరం ప్రధాన రహదారిపై నిర్వహిస్తున్న వాహన తనిఖీల్లో శుక్రవారం రూ.92,800 నగదు స్వాధీనం చేసుకున్నామని తహసీల్దార్ జె.సునీల దేవి తెలిపారు. పాలకొల్లుకు చెందిన శీలం సుష్మ కారులో రూ. 92,800 తీసుకుని వెళుతుండగా స్క్వాడ్ టీం స్వాధీనం చేసుకుందన్నారు. ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్న కారణంగా ప్రజలు రూ.50,000కి మించి నగదును వెంట తీసుకుని వెళ్లకూడదని వివరించారు.

ప్రజారంజక పాలనతోనే వైఎస్సార్ సీపీలో చేరికలు



యానాదులపుంతలో వైఎస్సార్ సీపీలో చేరిన యువతతో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజారంజక పాలన కారణంగానే పార్టీలో చేరికలు భారీగా జరుగుతున్నాయని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. అత్తిలి గ్రామంలో యానాదులపుంత నుంచి యానాదులు, గంగిరెద్దులకు చెందిన సుమారు 50 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ జగన్ పరిపాలనను యావత్ దేశం హర్షిస్తోందని, ఏపీలో అమలవుతున్న పథకాలన్నింటినీ మిగిలిన రాష్ట్రాలు సైతం పరిశీలిస్తుండడం శుభపరిణామమన్నారు. చిన్న వయస్సులోనే మంచి ఆలోచనలతో పేదరికాన్ని తుడిచిపెట్టాలంటే వారికి సంక్షేమం అందించడమే అని ఆలోచించిన గొప్ప మనసున్న వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి అడుగేసేందుకు పార్టీలో చేరిన వారందరినీ ప్రత్యేకంగా అభినందిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో ఎంబీసీ చైర్మన్ పెండ్ర వీరన్న, అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, సర్పంచ్ గంటావిజేత నాగరాజు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, జెడ్పీ కో-ఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో శశి సత్తా



ఇంటర్ విద్యార్థినులను అభినందిస్తున్న శశి వైస్ చైర్మన్ బూరుగుపల్లి లక్ష్మీ సుప్రియ

ఉండ్రాజవరం: ఇంటర్ ఫలితాలలో వేలివెన్ను శశి క్యాంపస్ విద్యార్థులు సత్తా చాటారని శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ శుక్రవారం తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 1,000 మార్కులకు గానూ ఎం.నవ్యశ్రీ 990, జి.పార్వతి 989, కె.లిఖిత 989 సాధించారని తెలిపారు. సీనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో కేఎస్ సాయి శివాణి 987, ఎండి.అబ్దుల్ జాఫర్ 985 , కె.శ్రీహసని 984, జీవీ మానిక 983 మార్కులు సాధించారని తెలిపారు. 985 మార్కులపైన 24 మంది, 980కు పైన 109 మంది, 950కు పైన 566 మంది, 900 మార్కులపైన 1,039 మంది సాధించారని చెప్పారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గానూ ఎం.లీలా కృష్ణారెడ్డి 466, డి.దుర్గా కౌసల్య 466 సాధించినట్టు తెలిపారు. జూనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో 440 మార్కులకు గానూ టి.కీర్తి 435, పీవీ హాసిని 435, వి.ఖ్యాతి 435 మార్కులు, ఎం. నిస్సి క్రిసోలైట్ 435, సీహెచ్ తేజశ్వి 435 మార్కులు సాధించారు. 464 మార్కుల పైన 26 మంది, 460కు పైన 155 మంది, 430కు పైన 950 మంది, 400కు పైన 1,453 మంది సాధించారని తెలిపారు. విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని శశి విద్యాసంస్థల వైస్ చైర్మన్ బూరుగుపల్లి లక్ష్మీ సుప్రియ అభినందించారు.

బాలికపై అత్యాచారయత్నం

టి.నరసాపురం: మైనర్ బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జగ్గవరం గ్రామానికి చెందిన ఏడేళ్ల బాలికను అదే గ్రామానికి చెందిన చిలకా లక్ష్మణరావు అతని ఇంటికి తీసుకువెళ్లాడన్నారు. చీమలు తొలగిస్తానని చెప్పి బాలిక దుస్తులు తొలగించి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. అయితే బాలిక శరీరంపై గాయాలు గుర్తించిన బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో లక్ష్మణరావుపై పోక్సో కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఆగిరిపల్లి: గత నెల 26న గన్నవరం మండలం వీరపనేని గూడెం వద్ద ఆటో బోల్తా పడిన ఘటనలో చిన్నాగిరిపల్లి గొల్లగూడేనికి చెందిన బడుగు శివమ్మ (33)పిన్నమనేని హాస్పిటల్ లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమం జగన్‌కు రెండు కళ్లు

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: ప్రతీ పేద కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న తలంపుతో వినూత్నమైన సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సీఎం జగన్మోహన్‌రెడ్డికి త్వరలో జరిగే ఎన్నికలలో మీరంతా అండగా నిలవాలని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. శుక్రవారం సాయంత్రం అత్తిలిలో కర్ణభక్తులు, నాయిబ్రాహ్మణులు, యానాదులు, గంగిరెద్దు సంఘ సభ్యులతో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతిగా పెత్తందార్లతో చేస్తున్న యుద్ధానికి ప్రజలంతా మద్దతుగా నిలబడాలన్నారు. కార్పొరేట్ వ్యవస్థలకు కొమ్ముకాస్తూ పేదలను ఎండగట్టిన చంద్రబాబు నైజం పేదలకు అర్థమైందన్నారు. టీడీపీకి ఓటేస్తే సంక్షేమానికి చరమగీతం పాడి, పెత్తందార్లకు దోచిపెడతారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ 58 నెలల కాలంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమాన్ని, పింఛన్లను అందచేసి పేదలపక్షపాతిగా పేరుపొందారని, చంద్రబాబు మాయ మాటలు నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి ప్రజల్లో నమ్మకాన్ని పెంచుకున్న ఒకే ఒక్క వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. చెప్పాడంటే చేస్తాడంతే అనే నానుడితో జగన్ పేరే ఒక నమ్మకంగా ప్రజల్లో బలంగా నాటుకుపోయిందని స్పష్టం చేశారు. తణుకు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, నరసాపురం పార్లమెంట్ అభ్యర్థిగా గూడూరి ఉమాబాలకు రెండు చోట్ల ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి మమ్మల్ని గెలిపించాలని కోరాడు. సంచార జాతుల కార్పోరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న మాట్లాడుతూ అణగారిన వర్గాలను గుర్తించేది ఒక్క జగన్ మోహన్‌రెడ్డి మాత్రమే అని అన్నారు. అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, మండలపార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, సర్పంచ్ గంటావిజేతనాగరాజు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్,మాజీ ఏఎంసీ చైర్మన్ కూనపరెడ్డి జయరాజు, మండలపార్టీ నాయకులు రంభ సూరిబాబు, గంటా నాగరాజు, పోలినాటి చంద్రరావు,కంకటాల సతీష్,రామిశెట్టి రాము, కాసగాని అబ్బులు, రంభ రాంబాబు, ఆకుల చినబాబు, అంతర్వేది, కుల సంఘాల ప్రతినిధులు దొడ్డిపట్ల కోటేశ్వరరావు, వసుమర్తి సీతాంబరం, కొడవర్తి సురేష్, ఐనపర్తి వెంకటేశ్వరరావు, చీపురుపల్లిసాయి, ఐనవల్లి రాజు, పెద్దిరాజు, మల్లు సత్యనారాయణ, చుక్కాకుల కన్నా, కొండయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

గూడెంలో ఫ్లాగ్ మార్చ్



తాడేపల్లిగూడెంలో సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించిన దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెం పట్టణంలో శుక్రవారం పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పోలీస్ ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలు ఉద్దేశించి సీఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా పట్టణ ప్రజలు ప్రభుత్వ ఆదేశాలను పాటించాలన్నారు. ఎస్సైలు సుధాకర్‌రెడ్డి, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టు వస్త్రాల సమర్పణ

పాలకొల్లు సెంట్రల్: ఉగాది పర్వదినం సందర్భంగా స్థానిక అచ్చుగట్లపాలెం చిత్రావిచెరువు గట్టున నిర్వహించే ముఖదారమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి భక్తులు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కుంపట్ల చిన్నరాజా, దీప్తి దంపతుల ఆధ్వర్యంలో మహిళల కోలాటం నిర్వహించారు.

క్లుప్తంగా

బలుసులమ్మకు కుంభ నివేదన



అమ్మవారి ఆలయంలో కుంభ నివేదన

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో ఉగాది సందర్భంగా శుక్రవారం బలుసులమ్మ తల్లి ఆలయంలోని అమ్మవారికి భక్తులచే కుంభ నివేదన అత్యంత వైభవంగా సమర్పించారు. భక్తులు వండినటువంటి పిండి వంటలు, బూరెలు, పాయసం, స్వీట్లు అమ్మవారికి సమర్పించారు. తొలుత ఆలయంలో విశేష పూజలు జరిగాయి. భక్తులు విశేషంగా హాజరై అమ్మవారిని దర్శించారు. అన్న ప్రసాదాలు స్వీకరించారు. ఆలయంలో మంగళ వాయిద్యాలతో సాయంత్రం నవహారతులు అందజేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఇంటర్ ఫలితాల్లో శశి గూడెం విద్యార్థుల హవా

తాడేపల్లిగూడెం: ఇంటర్ ఫలితాల్లో స్థానిక శశి జూనియర్ కళా శాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని సంస్థ అధినేత బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ శుక్రవారం తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 990 మార్కులను మొహ్మద్ మౌలా మొహిద్దీన్ , బైపీసీ విభాగంలో డి.జస్వంతి 979 మార్కులు పొందారన్నారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో ఏఎస్‌వీఎస్.సూర్యప్రసాద్, జే.బలరామకృష్ణలు 465 మార్కులు సాధించారన్నారు. 460 మార్కులకు పైగా 26 మంది విద్యార్థులు పొందారన్నారు. జూనియర్ బైపీసి విభాగంలో డి.చిన్మయి శ్రీవిద్యా 430 మార్కులు సాధించిందన్నారు. విద్యార్థు లు కళాశాల వైస్‌చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ క్రాంతిసుధలుఅభినందించారు.

వేసవిలో మజ్జిగ చలివేంద్రాలు ఎంతో ఉపయుక్తం



మజ్జిగ చలివేంద్రంలో లయన్స్‌క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వేసవిలో మజ్జిగ చలివేంద్రాలు ఎంతో ఉపయుక్తమని లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు అన్నారు. పట్టణంలోని కేఎన్ రోడ్డులో శుక్రవారం లయన్స్ సీనియర్ సభ్యులు పేరూరి కాశియ్య, చెంచు సుబ్బారావు, చిన్న సుబ్బారావు కుటుంబ సభ్యులచే చలివేంద్రం ఏర్పాటు చేశారు. మాణిక్యాలరావు చలివేంద్రంను ప్రారంభించి మాట్లాడుతూ 12 సంవత్సరాల నుంచి ఏర్పాటు చేసిన చలివేంద్రం ద్వారా మజ్జిగ పంపిణీ చేయడం ద్వారా పట్టణ, పరిసర గ్రామాల నుంచి వచ్చే ప్రయాణీకులకు, పాదచారుల దాహార్తిని తీర్చేందుకు విశేష కృషి జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు, కార్యదర్శి చిన్నం జగదీష్, కోశాధికారి జీడిగుంట హరిబాబు, దాట్ల లక్ష్మిపతిరాజు, సన్నిధి సూర్యనారాయణ మూర్తి, లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో తణుకు శశి హవా

తణుకు టౌన్: ఇంటర్ ఫలితాల్లో తణుకు శశి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యున్నత మార్కులు సాధించినట్లు శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాల కృష్ణ తెలిపారు. శుక్రవారం విడుదల చేసిన ఇంటర్ పరీక్షా ఫలితాలలో జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో భూపతిరాజు ఉమా ప్రవల్లిక, మీసాల జయరామ్‌లు 466 మార్కులు సాధించి పట్టణంలో ప్రథమంగా నిలిచారని తెలిపారు. బైపీసీ విభాగంలో కొక్కిరాల శ్రావణి 436 మార్కులతో పట్టణంలో ప్రథమంగా నిలిచారని తెలిపారు. సీనియర్ ఎంపీసీలో వెలగల హేమశ్రీ సంతోషి లక్ష్మీ 989 మార్కులు సాధించినట్లు తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను శశి విద్యా సంస్థల వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మేకాక్రాంతి సుధ, ప్రిన్సిపాల్ వెలగల సత్యనారాయణరెడ్డి అభినందించారు.

లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు



లక్ష్మీగణపతిస్వామికి పంచామృత అభిషేకాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక వాసవి కన్యక పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో చైత్ర శుద్ధ చవితి పురస్కరించుకుని శుక్రవారం లక్ష్మీగణపతి స్వామి మూల విరాట్‌కు పంచామృతాలు, ఫలరసాలు, సుగంధద్రవ్యాలతో విశేష అభిషేకాలు జరిగాయి. స్వామి వారికి విశేష అలంకరణ గావించారు. ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి నున్న బాల త్రిపుర సుందరరావు, ఆలపాటి సత్యనారాయణ, కృష్ణకుమార్‌లు పర్యవేక్షించారు.

వైఎస్సార్ సీపీలో బీసీలకు ప్రాధాన్యం



రేలంగిలోని గౌడ, శెట్టి బలిజ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

ఇరగవరం: బడుగు, బలహీన వర్గాలకు అన్ని రంగాల్లోను అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరావు అన్నారు. గురువారం రాత్రి ఇరగవరం మండలంలోని రేలంగి గ్రామంలో బీసీ కులస్తుల ఆత్మీయ సమావేశానికి మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు భావించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపానల సాగించారని తెలిపారు. జగనన్న అందజేస్తున్న సంక్షేమ పథకాలే ప్రజలకు శ్రీరామరక్షగా నిలుస్తున్నాయన్నారు. ప్రజా సంక్షేమం కోసం జగన్ మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రతి ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్‌కు ధీటుగా అభివృద్ధి చేశారన్నారు. బీసీలకు పెద్ద పీట వేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు యోగేంద్ర బాబు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం, గ్రామ పార్టీ అధ్యక్షుడు పులుపు అనిల్, పులుపు సునీల్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వీరమల్లు ఫణీంద్ర, ఉప సర్పంచ్ పులుపు అక్కమాంబ, నాయకులు వడ్డే మార్కేండేయులు, చేబ్రోలు పెద్ది రాజు కోట నాగేశ్వరరావు, గూడూరి జగదీష్, వీరమల్లు రాము, వీరముల్లు గణపతి, తదితరులు పాల్గొన్నారు.

ఎండలు మండిపోతున్నాయ్..!



తాడేపల్లిగూడెం పట్టణం తాలూకాఫీస్ సెంటర్ నిర్మానుష్యంగా మారిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో ఎండలు మండిపోతున్నాయి. గత నాలుగైదు రోజులుగా అత్యధికంగా 39 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 9 గంటలకే తీవ్ర స్థాయిలో భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. మధ్యాహ్నం 12 గంటలకు వేడి గాలలు వీయడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. దీంతో తాలూకాఫీస్ సెంటర్, పోలీస్ ఐలాండ్‌సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాలు జన సంచారం లేక నిర్మానుష్యంగా మారుతున్నాయి. రోహిణి కార్తె ప్రవేశించకుండానే ఎండలు మండిపోవడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే మే నెలలో ఎండలు ఎలా ఉంటాయోనని వాపోతున్నారు. మరో పక్క రానున్న మంగళవారం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది.

భవిత సేవలను సద్వినియోగం చేసుకోండి



భవిత సెంటర్‌లో మాట్లాడుతున్న ప్రత్యేక ఉపాధ్యాయులు బాల ఈశ్వరయ్య

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని సుబ్బారావుపేట భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రంను దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని, సమగ్ర శిక్ష ద్వారా ఉచితంగా అందించే సర్వీసెస్‌లు అందుబాటులో ఉన్నాయని భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయులు బాల ఈశ్వరయ్య పేర్కొన్నారు. భవిత సెంటర్‌లో శుక్రవారం ఈశ్వరయ్య మాట్లాడుతూ మాటలు రాని వారికి మాటలు నేర్పించడం, నడక సరిగా రాని వారికి ఫిజియోథెరపీ, ప్రవర్తన సమస్యలు ఉన్న పిల్లలకు ప్రత్యేక శిక్షణ ద్వారా ప్రవర్తనలో మార్పులు, దివ్యాంగులకు అవసరమైన వారికి ఉపకరణాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. 2023-24 సంవత్సరానికి గాను దివ్యాంగుల పిల్లలకు వివిధ రకాలైన అలవెన్స్‌లు వారి తల్లిదండ్రుల ఖాతాలో సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ వారిచే జమ చేయడం జరిగిందని, తప్పక పిల్లలను చదివించాలని కోరారు. ఇతరుల మీద ఆధారపడకుండా జీవించేందుకు భవిత సెంటర్ ఎంతో ఉపయుక్తమని, తప్పక సర్వీసెస్‌లను ఉపయోగించుకోవాలని కోరారు.

మంత్రి కారుమూరి విజయానికి కృషి చేయాలి



తణుకులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి సుబ్బారావుతో పార్టీ శ్రేణులు

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకంగా అందిస్తున్న సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలంతా వైఎస్సార్ సీపీకి అండగా నిలబడాలని వైఎస్సార్ సీపీ నాయకులు, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు అన్నారు. తణుకు పాతవూరు 9వ వార్డు పెద్ద వంతెన ప్రాంతంలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్ స్ఫూర్తితో తణుకు నియోజకవర్గంలోని ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ అండగా నిలబడుతున్న మంత్రి కారుమూరి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఎంపీ, ఎమ్మెల్యే రెండు సీట్లకు సంబంధించి రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నూకల కనకదుర్గ, ఉండవల్లి జానకి, బెజ్జవరపు హేమశ్రీ, వార్డు నాయకులు తాటిపర్తి వాసు, పిల్లి సూరిబాబు, తాటిపర్తి దుర్గాప్రసాద్, టి.బోసు, సూర్యనారాయణ, కుడుపూడి చంద్రరావు, డోలా సింహాద్రి, పంపన సూరిబాబు, సామంతుల అప్పారావు, రేలంగి రాంబాబు, ఫహీమా, తోకల చంద్రకళ, టి.శకుంతల, సప్పా శ్రీనివాస్, చింతన్న తదితరులు పాల్గొన్నారు.

జగనన్న అందించిన సంక్షేమమే శ్రీరామరక్షగా ప్రజలు భావిస్తున్నారని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు కుమార్తె దీపిక అన్నారు. తణుకు 4వ వార్డు గణేష్ చౌక్ ప్రాంతంలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి గడపలోను జగనన్న సంక్షేమాన్ని ప్రస్తావిస్తూ జగన్‌కే మేము అండగా నిలబడతామని చెబుతుండడం సంతోషంగా ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి కారుమూరిని, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలను గెలిపించాల్సిందిగా ప్రజలను కోరానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, తణుకు పట్టణ బీసీసెల్ మహిళాధ్యక్షురాలు బెజ్జవరపు హేమశ్రీ, నియోజకవర్గ మైనారిటీ సెల్ మహిళాధ్యక్షురాలు ఫహీమా, ఉండ్రాజవరపు గీత, టి.శకుంతల, తోకల చంద్రకళ, శ్రీలలిత తదితరులు పాల్గొన్నారు. పెదపాటిసుబ్రహ్మణ్యం, షేక్ బాజీ, అనపర్తి జయరాజు తదితరులు పాల్గొన్నారు.

కొట్టు సత్యనారాయణను మరోసారి ఆశీర్వదించండి



కొట్టు సత్యనారాయణను గెలిపించాలని ప్రజలు కోరుతున్న కొట్టు తనయుడు రాజేష్

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెం నియోజకవర్గ ప్రజలు శాంతిభద్రతలతో, ప్రశాంతమైన జీవనం సాగించాలంటే ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను వచ్చే ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కొట్టు తనయుడు రాజేష్, కుమార్తె కాంచన ప్రజలను కోరారు. శుక్రవారం 8వవార్డులో ఎన్నికల కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వైఎస్సార్ సీపీ ప్రచారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కొట్టు తనయులు మళ్లీ ఎమ్మెల్యేగా కొట్టు సత్యనారాయణను గెలిపిస్తేనే అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని, రెండవ సమ్మర్ వాటర్ స్టోరేజి నిర్మాణం పూర్తవుతుందని, శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొట్టు తనయుడు రాజేష్, కుమార్తె కాంచనలు కొందరు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



సబ్ యూనిట్‌చే వార్డులో హెల్త్ సిబ్బంది ర్యాలీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): చిన్న దోమతో పెద్ద ప్రమాదం ఉందని దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను ప్రజల భాగస్వామ్యంతో అరికడదామని మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వి.లక్ష్మణరావు పేర్కొన్నారు. పట్టణంలో జరుగుతున్న ఫీవర్ సర్వేలు, హెక్టార్ కంట్రోల్ హైజీన్, డ్రైడే, ఫ్రైడే కార్యక్రమాలపై హెల్త్ సిబ్బందిచే శుక్రవారం అవగాహన ర్యాలీలు 33, 34, 35 వార్డుల్లో జరిగాయి. ప్రజారోగ్య పరిరక్షణ, దోమ లార్వాలను అరికట్టేందుకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. లక్ష్మణరావు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని, జ్వర లక్షణాలు ఉన్నవారు తప్పక ఆరోగ్య కార్యకర్తల దృష్టికి తీసుకు వెళ్లాలని కోరారు. నాలుగు పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రి అందుబాటులో ఉన్నాయని, అనారోగ్య సమస్యలు వచ్చిన సమయంలో వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శులు చినపాప, రాజేశ్వరీ, జ్యోతి, ఆరోగ్య సహాయకులు కాంతారావు, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

రేపు అంబేడ్కర్ జీవిత చరిత్రపై చిత్రలేఖన పోటీలు

పెంటపాడు: అంబేడ్కర్ జయంతి పురస్కరించుకొని ఈ నెల 13న మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉపన్యాస, చిత్రలేఖన పోటీలు నిర్వహించాలని ఎంఈవో టీవీ రామకృష్ణ ఒక ప్రకటనలో కోరారు. ప్రతి పాఠశాలల్లో మధ్యాహ్నం 12.30 గంటలకు ఒకేసారి 8,9 తరగతుల విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 14న అంబేడ్కర్ జయంతి పురస్కరించుకొని మండల కార్యాలయంలో బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనపరచిన విద్యార్థులకు మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో రూ. 20 వేల విలువైన బహుమతులు అందిస్తారని తెలిపారు. కార్యక్రమాన్ని అన్ని ప్రభుత్వ పాఠశాలల 8,9 తరగతుల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దువ్వలో ఇంటింటా ప్రచారం

తణుకు టౌన్: త్వరలో జరిగే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయాన్ని కోరుతూ తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలోని గ్రామ కమిటీ నాయకులు, కార్యకర్తలు గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరో సారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అలాగే వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, నరసాపురం పార్లమెంట్ అభ్యర్థి గూడూరి ఉమా బాలలను ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, గ్రామ కమిటీ అధ్యక్షుగు గోపాల కృష్ణ, మండల రైతు విభాగం అధ్యక్షుడు దండు వెంకట కృష్ణంరాజు, నాయకులు శనగన ఏడుకొండలు, సునీల్, కొయ్యల సుబ్బారావు, సూర్యారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేల్పూరు గ్రామంలో ... మండలంలో వైఎస్సార్ పీ నాయకులు శుక్రవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఎంపీటీసీలు చుండ్రు శ్యామల పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామాలు



తణుకు పట్టణంలో రాజీనామాలు చేసిన 6,7,17 వార్డుల వలంటీర్లు

తణుకు అర్బన్: వలంటీర్లపై చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల మాటల తూటాలు, సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారాలు చవిచూసిన వలంటీర్లు తమ విధులకు రాజీనామాలు చేస్తున్నారు. తణుకులో శుక్రవారం కొందరు వలంటీర్లు రాజీనామాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాకు అప్పగించిన సేవను విజయవంతంగా పూర్తిచేశామని, పేదప్రజలకు అండగా నిలబడ్డందుకు చంద్రబాబు మమ్మల్ని మూటలు మోసే ఉద్యోగాలా అని హేళన చేయగా, జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాత్రం మరీ దారుణంగా అమ్మాయిల కిడ్నాప్‌లలో మా ప్రమేయం ఉందంటూ మాట్లాడడంతో విసిగిపోయామని దీంతోపాటు చంద్రబాబు తన అనుయాయుడితో పిటిషన్ వేసి మమ్మల్ని విధుల నుంచి తప్పించడం వంటి ఘటనలు చూసి మేము రాజీనామాలు చేసినట్లు వెల్లడించారు.



తణుకులో రాజీనామాలు చేసిన పత్రాలతో వలంటీర్లు

రాజీనామాలు చేసిన వలంటీర్లు

తణుకు అర్బన్: వలంటీర్లపై టీడీపీ, జనసేన శ్రేణులు సామాజిక మాధ్యమాల ద్వారా చేస్తున్న దుష్ప్రచారంతో పాటు చంద్రబాబు తమను విధుల నుంచి తప్పించాడంటూ తణుకులో 6, 7, 17, 25 వార్డులకు సంబంధించిన వలంటీర్లు శుక్రవారం రాజీనామాలు చేశారు. జగనన్న అందిస్తున్న సంక్షేమాన్ని పారదర్శకంగా లబ్ధిదారులకు పంపిణీ చేసిన తృప్తి మాకుందని, కానీ పింఛన్లు ఇచ్చే విధుల నుంచి తప్పించినందుకు నిరసనగా మేము రాజీనామాలు చేస్తున్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంటర్ ఫలితాల్లో శ్రీ వాసవి ప్రతిభ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇంటర్ ఫలితాలలో పట్ట ణంలోని శ్రీవాసవి జూని యర్ కళాశాల ప్రతిభ చూపింది. సెకండ్ ఇయర్ ఎంపీసీలో ధారా బత్తుల జయమణి 914/1000 మార్కులతో కళాశాలకు ప్రథమ స్థానం, రెండో సంవత్సరం సీఈసీలో గుత్తికొండ లక్ష్మీ ప్రసన్న 896/1000 మార్కులతో టాపర్‌గా నిలిచారు. అదే విధంగా ఇంటర్ మొదటి సంవత్సరంలో దాసిరెడ్డి తులసీ ప్రసన్న 453/500 మార్కులతో టాపర్‌గాను, కట్టుమోను భవానీ 428/500 మార్కులు సాధించారు. మంచి ఫలితాలు సాధించిన ఇంటర్ విద్యార్థులకు కళాశాల చైర్మన్ ఎన్‌వీ రమణారావు, కార్యదర్శి మండ బ్రహ్మాజీ, కోశాధికారి ఆలపాటి బోస్, ప్రిన్సిపాల్ మద్దాల రామకృష్ణ, అధ్యాపకులు అభినందనలు చెప్పారు.

ఇంటర్ ఫలితాల్లో సెంట్ ఆన్స్ విజయకేతనం

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్ర వ్యాప్తంగా విడుదలైన ఇంటర్ ఫలితాలలో పట్టణానికి చెందిన సెంట్ ఆన్స్ విజయ కేతనం ఎగురవేసింది. సీనియర్ ఇంటర్ విద్యార్థులు వీఎన్‌ఎస్‌ఆర్ నందినికి 986/1000, టి.హాసిని 975/1000 , వి.దివ్య 973/1000 లు సాధించారు. అదే విధంగా పి.కుసుమాంజలి 462/470, ఆర్‌బీఎల్ చంద్రిక 461/470 , ఎస్.వేణుగోపాల్ 461/470 సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను కళాశాల చైర్మన్ అద్దంకి విజయకుమార్, ప్రిన్సిపాల్ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.